క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుచి, విరల్‌ఫార్మా, శెట్టి, ఐటీసీ, భరత్‌నగర్ 11 కేవీ పీడర్ల పరిధిలోని ఐడీఏ ఫేస్-4,ఫేస్-1లోని కొంత ప్రాంతం, ఫేస్-3, భరత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, సావన్, నవోదయనగర్, గెయిల్ 11 కేవీ పీడర్ల పరిధిలోని మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నాలా పనుల పరిశీలన



బోడుప్పల్: 21వ డివిజన్ పరిధిలో రూ 2 కోట్లతో చేపట్టిన నాలా పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్, డీఈఈ శారద పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టి ఉంచుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. వర్షా కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ డివిజన్ అభివృద్ధికి కృషి



అల్వాల్: అల్వాల్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఎంఈఎస్ భరత్‌పురి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన రాయుడి చెరువు ఔట్‌లేట్ నుంచి దుర్వాసన వస్తుందని, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం , పారిశుద్ధ్య, ఫాగింగ్, బండ్‌పై ప్లాంటేషన్ తదితర పనులు చేపట్టాలని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా పనులు చేపడుతామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ. మంజుల, ఎస్‌ఎఫ్‌ఏ భాస్కర్, వెంకటేష్, మహేందర్, అరవింద్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్యాంప్‌ను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆసరా సెంటర్లను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, సరిత, నాయకులు సత్యనారాయణ, సంపత్, బాబు, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కుషాయిగూడ: ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్ మతీన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని 12 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదరు భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. దీంతో బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కె. రాజేందర్, ఆర్ఐ ఆనంద్, సర్వేయర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీ, గంగపుత్ర కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. డీఈ. మహేష్, జలమండలి అధికారి రమేష్, శానిటేషన్ అధికారులు ప్రభాకర్, రమేష్, కాలనీ వాసులు నరసయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్ లీకై మహిళకు గాయాలు

ఉప్పల్: గ్యాస్ లీకేజీ కారణంగా నిప్పంటుకుని ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి, మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన యాకమ్మ(52), రామంతాపూర్ నేతాజీ నగర్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ స్కూల్ లో ఆయాగా పని చేస్తుంది. శనివారం ఉదయం వంట చేయడానికి వెళ్లిన ఆమె స్టౌ వెలిగించేందుకు ప్రయత్నించగా నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమె చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కదం తొక్కిన పారిశుద్ధ్య కార్మికులు

- సర్కిల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు
- ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్
- పలు పార్టీల నేతల సంఘీభావం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

కాప్రా: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పారిశుద్ధ్య కార్మికులు కదం తొక్కారు. పలు సర్కిల్ కార్యాలయాల ఎదుట శనివారం పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు.

కాప్రా సర్కిల్‌లో..

కాప్రా మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేస్తానని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం సర్కిల్ కార్యాలయ ఆవరణలో వంటావార్పు నిర్వహించారు.

నమ్మించి నట్టేట ముంచారు: సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

కేసీఆర్ రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ బి-బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు వారితో కలిసి పోరాడతానన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి లేకపోగా రాష్ట్ర ప్రజలపై రూ. 5 లక్షల కోట్లు అప్పుల భారం మోపారని,.. కేసీఆర్ కుటుంబం మాత్రం రూ.5 లక్షల కోట్లకు ఆస్తిపరులయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

మల్కాజిగిరి: ఔట్ సోర్సింగ్ కార్మికులకు కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు సంజీవ, వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు కేసీఆర్ ఉద్యోగాలను పర్మనెంట్ చేయడంతో పాటు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు , హెల్త్‌కార్డులు అందజేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా తమకు న్యాయం జరగలేదన్నారు.

బోడుప్పల్‌లో..

బోడుప్పల్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి. సతీష్‌కుమార్ అన్నారు. బోడుప్పల్ నగర పాలకసంస్థ కార్యాలయం ఆవరణంలో సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి ప్రతిష్ఠాత్మక పనులు చేపట్టిన మున్సిపల్ ఉద్యోగులు ముందుండి సేవలు అందిస్తున్నారన్నారు. ఆశావర్కర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, వీఆర్‌వోలు, వీఆర్‌ఎలకు ఉద్యోగ భద్రత కల్పించిన ప్రభుత్వం తమపై వివక్ష చూపడం దారుణమన్నారు. మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుని మున్సిపల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, సలహాదారులు అంజయ్య, ముఖ్య సలహాదారు సాయిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు బాలనర్సింహ్మ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మల్లారెడ్డి, జ్ఞానేశ్వర్, కోశాధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా ..



కాప్రా సర్కిల్ కార్యాలయంలో వంటావార్పు...



మాట్లాడుతున్న సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి..

ప్రభుత్వానికి పేదల ఉసురు తగులుతుంది



మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

రామంతాపూర్ : ఎన్నికలు వచ్చినప్పుడల్లా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటున్నారని తొమ్మిదేళ్లు గడిచినా సొంతింటి కల నెరవేరని పేదల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని రాజ్యసభ సభ్యులు, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం రామంతాపూర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ చేపట్టిన 48 గంటల నిరసన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లబొల్లి కబుర్లు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ పేదలను మాయ మాటలతో వంచించి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. అమలుకు నోచుకోని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ నాయకుల బాగోతాన్ని త్వరలోనే బయట పెడతామన్నారు. కేసీఆర్ మాటలు కోటలు దాటుతాయని చేతలు మాత్రం గడప దాటవని ఆయన ఎద్దేవా చేశారు. సొంతింటి కలను నెరవేర్చని ఈ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తామన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రభాకర్ చేస్తున్న పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద ప్రజల సొంతింటి కల నెరవేరడానికి తాను దీక్ష చేపట్టానని నిబద్ధతతో నిర్వహిస్తున్న ఈ దీక్షతో ప్రభుత్వం మెడలు వంచి పేద ప్రజల కలలను త్వరలోనే నిజం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, లక్ష్మణ్, పద్మారెడ్డి, రాజు, రేవు నర్సింహ, సోమశేఖర్‌గౌడ్, తాళ్ళ బాలకృష్ణ, జగన్ యాదవ్, భాగ్యలక్ష్మి, మంగాగౌడ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా చెరువును కాపాడండి



సముద్రాల వేణుగోపాలచారికి వినతిపత్రం అందజేస్తున్న సంజీవరెడ్డి

కాప్రా: కాప్రా చెరువు కనుమరుగయ్యే ప్రమాదం నెలకొందని చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కాప్రా కాలనీస్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు నాగిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్. వేణుగోపాల చారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో చెరువులన్నీ అభివృద్ధి చెందుతున్నా కాప్రా చెరువు మాత్రం అభివృద్ధి నోచుకోవడంలేదన్నారు. గతంలో ఈ చెరువుకు ప్రభుత్వం రూ. 9 కోట్లు కేటాయించినా చెరువును అభివృద్ధి చేయడంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నిధుల వినియోగంపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. ఎంతో చరిత్ర కలిగిన కాప్రా చెరువుకు ప్రస్తుతం వర్షపునీరు రాకుండా కొందరు అడ్డుకట్టలు వేశారని ఆయన ఆరోపించారు. వచ్చిన కొద్దిపాటి నీటిని కూడా చెరువులో నిల్వ ఉండకుండా తూముల ద్వారా వదిలేస్తున్నట్లు తెలిపారు. కాప్రా చెరువును స్వయంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని వేణుగోపాలచారికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో కాప్రా చెరువును పరిశీలించనున్నట్లు తెలిపారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రదర్శనను తిలకిస్తున్న సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ తన్వీ అరోరా తదితరులు

మల్లాపూర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలను రూపొందించి భావి భారత శాస్త్ర వేత్తలుగా ఎదగాలని సీఎస్ఐఆర్-సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ తన్వీ అరోరా అన్నారు. శనివారం మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో (ప్రిస్మటిక్) 2023 సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎస్ఐఆర్ సీసీఎంబీ శాస్త్రవేత్త తన్వీ అరోరా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు రూపొందించిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, సోలార్, విద్యుత్, బయోలాజీ, ఎగ్జిబిట్‌లు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆరెంజన్ లైఫ్ సైన్స్ కంపెనీ ప్రతినిధి డాక్టర్ అనూప్ కుమార్, ఓవైసీ ఆస్పత్రి జెజీఎస్ డాక్టర్ అనంత నైక్, జాన్సన్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రబతి బసు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గౌతంనగర్: భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్‌లో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసుతల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ. లౌక్య, ఏఈ దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల ఏర్పాటుకు చర్యలు

మల్కాజిగిరి:మల్కాజిగిరి డివిజన్ పరిధిలో గుర్తించిన ప్రభుత్వ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శనివారం హార్టికల్చర్ విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రాంతాలు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి వివాదాలు లేని మూడు ప్రభుత్వ స్థలాలను గుర్తించామని వాటిని పార్కులుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో మేనేజర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు వెంకటేష్,రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మల్లాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ తరుపున నిరంతరం పోరాటం చేస్తున్నామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలపై బస్తీ నిద్ర కార్యక్రమంలో భాగంగా పఠాన్ బస్తీ, ఓల్డ్ మల్లాపూర్, ఎస్సీ బస్తీ, సుభాష్‌నగర్, సూర్యనగర్, పిట్టల బస్తీ, బ్రహ్మపురి కాలనీ, ఎస్వీ నగర్లో గడపగడపకు తిరిగి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో డ్రైనేజీ, తాగునీటి సమస్య, వృద్ధ్యా పింఛన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ ఇళ్ల సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తున్నారన్నారు. అధికారులు. ప్రజా ప్రతినిధులు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వంగేటీ సంజీవరెడ్డి, మల్లి కార్జున్‌గౌడ్, అంజయ్య,కొప్పెర సాయి, నెమలి అనిల్, ఉమేష్‌గౌడ్, రాజేష్, బెల్లం గట్టయ్య, ప్రభాకర్‌రెడ్డి,పీజీ సుదర్శన్, రాజుగౌడ్, దంతూరి రాజు గౌడ్, బాలరాజుగౌడ్, ఆశ్రూ,హెచ్ ఆర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 5 లక్షలకు పెంచుతాం



అల్వాల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచుతామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. 'కాలనీ నేస్తం- కాంగ్రెస్ హస్తం' నినాదంతో శనివారం వినాయక్‌నగర్ డివిజన్‌లోని లాల్‌వాణీనగర్ నుంచి జైన్ మందిర్, శివగౌరి ఎన్‌క్లేవ్, నవభారతి కాలనీ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరోగ్య శ్రీ పరిమితి రూ.5 లక్షలకు పెంచుతామన్నారు. పేదలకు గృహ నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం, గ్యాస్ సిలిండర్ రూ. 500 వందలకే ఇస్తామన్నారు. యువతులకు ఎలక్ట్రికల్ స్కూటర్స్, రూ. 4 వేల నిరుద్యోగ భృతి, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, గుత్తి రాంచందర్, శ్రీనివాస్, కీర్తి గణేష్, గిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



పద్మారావు చేతుల మీదుగా చెక్కు అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా బండారి లక్ష్మారెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. కాప్రా సాయిబాబానగర్‌లో శివాలయం నిర్మాణానికి బీఎఆల్ఆర్ ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ చెక్కును శనివారం పద్మారావుగౌడ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు బండారి లక్ష్మారెడ్డి అందజేశారురు. బీఎల్ఆర్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని..మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు భైరి నవీన్‌గౌడ్, దామోదర్‌గౌడ్, రాము ముదిరాజ్, భాస్కర్ యాదవ్, సాయి, విష్ణుగౌడ్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాములకు ముత్యాల హారం



మౌలాలి: మౌలాలి డివిజన్ గణేష్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో శనివారం శ్రీ సీతారాముల స్వామి వారికి గౌలికర్ శంకర్, గౌలికర్ నాగేశ్వర్‌రావు, జానకి, మోహన్‌రావు, సంధ్య, లావణ్య ముత్యాల హారాన్ని సమర్పించారు. భక్తులు వారిని ఆదర్శంగా తీసుకుని, ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సరి చూసుకోండి



మల్కాజిగిరి: ప్రతి ఒక్కరు ఓటర్ల జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.రాజు అన్నారు. శనివారం మల్కాజిగిరి క్రాస్ రోడ్స్ నుంచి సఫిల్‌గూడ వరకు 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకుని లేని వారు నమోదు చేసుకోవాలన్నారు. మార్పులు చేర్పులకు సైతం దరఖాస్తులు అందజేయాలన్నారు. అక్టోబర్ 1 వ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్వాల్ తహసీల్దార్ సుధ, ఏఎంసీ దయానంద, సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జోజిరెడ్డి

అల్వాల్: విద్యార్థులు కళాశాల స్థాయిలోనే విద్యతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని లయోల అకాడమీ ప్రిన్సిపాల్ జోజిరెడ్డి అన్నారు. అల్వాల్ లయోల అకాడమీలో శనివారం ఉద్యోగాల కల్పనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జోజిరెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశాలతోపాటు జనరల్ నాలెడ్జ్, ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే సూచనలు అందజేస్తున్నామని దీంతో లయోల విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలి

ఉప్పల్: విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం అన్నారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఇన్‌వెస్టీచర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌వీ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి నాయకత్వ లక్షణాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. ఉన్నతమైన ఆశయంతో చదువుకుని గొప్ప పదవులను అలంకరించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ జయంతి రెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు.



విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

బోడుప్పల్: ఓ షాప్ వద్ద నేమ్ బోర్డు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవ శాత్తు ట్రాన్స్‌పార్మర్ తగిలి ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన శనివారం బోడుప్పల్‌లో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోడుప్పల్ ప్రధాన రహదారిలో కరుణాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఐస్ క్రీమ్ పార్లర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం షాపు వద్ద నేమ్ బోర్డును ఏర్పాటు చేయిస్తున్నాడు బోర్డు పెద్దగా ఉండడంతో ఉపేందర్, సురేష్ వెల్డింగ్ మిషన్‌తో కట్ చేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు తగలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

జెడ్‌పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



రామంతాపూర్ : ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఈ - పాస్ నిర్మాణ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన కిడ్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.10 లక్షల విలువ గల కిడ్స్ కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన దాతలను ఆమె అభినందించారు. దాతలు శాంత కుమార్, జాన్, లావణ్య, శ్రీకాంత్‌తో పాటు ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వసతులు కల్పించాలి



అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని ప్రభుత్వ కళాశాలలో తరగతి గదులు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు అజయ్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కిక్కిరిసిన తరగతి గదులు, అపరిశుభ్రమైన బాత్‌రూమ్‌లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నేతలు రెబ్బవాసు, సాయిప్రసాద్, రేవంత్, శంకర్ పాల్గొన్నారు.